# అదండీ కథ

యమ్.వి. సీతారామ్

కాలేజి మొత్తంమీద రాజారావంటే తెలియనివారు లేరనే చెప్పాలి! బహుశా మీకు తెలిసే వుంటుందనుకుంటా! (పొరపాటున మీ పేరు కూడా రాజారావు కాదు కదా!)

రాజారావు నాకు మిత్రుడు, బయట ఎలా అల్లరి చేసినా నా దగ్గర పిల్లే. నేను ఎంత చెబితే అంతే! అలాగని నేనేమీ కాలేజి ప్రిన్సిపాల్ ని. కాను, రాజారావేమీ లెక్చరర్ అంతకంటే కాదు. మేం ఇద్దరం ఓ.వి. యన్. కాలేజీ స్టూడెంట్స్మి!

చలాకిగా తిరిగే 'రాజారావు' మంచం మీద జబ్బు పడ్డాడని తెలిసి వాళ్ళింటికి పరిగెట్టాను! చెప్పొద్దూ మంచంమీద నీర్సంగా వున్నాడు. బత్తాయి తొనలు చప్పరిస్తున్నాడు. నన్ను చూసి చిన్నగా నవ్వి కూర్చోమన్నాడు.

కళ్ళు లోపలికి వెళ్ళి,కొద్దిగా చిక్కినట్టు కన్పడుతున్నాడు. పైన ఫ్యాను తిరుగుతున్నా ఒళ్ళంతా చెమటతో తడిసిపోయివుంది.

'ఎంత చలాకితనం, అలాంటిది, ఇలా మంచంమీద దిగులుగా వుండేసరికి నాకే బాధ అన్పించింది.'

మొన్నటికి మొన్న ఆ రాధని ఏడ్పిస్తున్నప్పుడు ఎంత ఎంజాయ్ చేశాం. ఆ ముందురోజు క్రొత్త కుర్ర లెక్చరర్ ప్రకాశాన్ని ఎలా అదరగొట్టేశాడు, తన అద్భుత ఉపన్యాసంతో! తన గర్ల్ ఫ్రెండ్ 'లలిత'ని ఏడ్పించినందుకు సుందరానికి బట్టలిప్పించి మొత్తం కాలేజీ గ్రౌండంతా అందరిముందు ఎలా పరిగెట్టించాడు (చాలా చిన్న గ్రౌండ్ లెండి!). ఆ చలాకీతనం మచ్చుకయినా కన్పడ్డంలేదు 'రాజారావు' ముఖంలో.

"ఏరా అలాగున్నావు?" అడిగాను.

"ఎలా వున్నాను, బాగానే వున్నాను."



మాతిలోంచి వచ్చినట్టు వచ్చింది సమాధానం, రాజారావు ద్వారా.

"ఏం ఏదైనా గొడవ జరిగిందా, చెప్పు, మన గూండా గ్యాంగుని పంపించి..."

"సారీరా, నేనేం మాట్లాడదల్చుకోలేదు" అన్నాడు ముఖంపైకి దుప్పటిని లాక్కుంటూ.

"పోనీ, నీ గర్ల్‌ఫ్రెండ్, అదే నా

చెల్లెలు'లలిత'కి నాళ్ళింట్లో పెళ్ళి సంబంధాలు చూడ్డంకాని, ఆమె నీతో ఏమైనా గొడవలు పెట్టుకోవటంకాని ఏమైనా జరిగిందా" అనుమానంగా అడిగాను.

"దయచేసి....

"నిన్నేమీ అడగొద్దు అంటావు? ఎలా? కష్టాల్లో వున్నట్టు నీ ముఖంలో బాధ స్పష్టంగా కన్పడుతోంది, నువ్వు రెండ్రోజులుగా ఎవరికీ కన్పడని నీ ముఖం గురించి 'క్లియర్'గా తెలుస్తూనేవుంది. చెప్పు,కారణం చెప్పు, లేకుంటే నామీద ఒట్టే!" (ఒట్టులమీద నమ్మకం లేకపోయినా, స్నేహితుడు కష్టాల్లో వున్నప్పుడు 'సెంటిమెంట్'కి ప్రాధాన్యతనివ్వమని అదేదో తెలుగు సినిమాలో డైలాగు వుంది. అది గుర్తొచ్చింది).

"చెప్పక తప్పదంటావా...."

"చెప్పమనే కదరా అడుగుతున్నాను..." అన్నాను సీరియస్‌గా.

మంచం మీద నుంచి లేచి, బీరువాదగ్గరకెళ్ళి బీరువా తీస్తున్నాడు.

చెపుతానని, బీరువా దగ్గరకెళ్ళి....

"ఇదిగో చూడరా..."అంటూ ఓ చిన్న పుస్తకాన్ని అందించాడు.

"ఆటోగ్రాఫ్ బుక్, ఏం...?"

"ఎందుకిలా వున్నావని అడిగావే, జవాబుగా ఇది చూడమన్నాను" గొంతులో రవ్వంత సీరియస్ కన్పడుతోంది స్పష్టంగా.

వరుసగా పేజీలు తిరగేస్తున్నాను.

"నిండు నూరేళ్ళు, కలకాలం బ్రతకాలని...అవినాశ్."

"వుయ్ ఎంజాయ్ అవర్ సెల్ఫ్, బట్ డోంట్ ఎంజాయ్ విత్ లైఫ్.... లలిత"

"శుభాభినందనలతో"....ప్రిన్సిపాల్, ఓ.వి.యన్. కాలేజి.

"సాగరమనే జీవితం ముందుంది, సాగిపో ఈదుకుంటూ..." -కుమారి అంజాత".

"విష్ యు హేపీ లైఫ్ ఇన్ యువర్ ఫ్యూచర్ కెరియర్" -శర్మిల

"నందనం లాంటి కాలేజీలో విచిత్రంగా కలిశాం. మళ్ళీ మన కలయిక ఏనాటికో మిత్రమా..." -మధుభాషిణి

"ఐ లవ్ యూ..." -అపూర్వ

వరుసగా పేజీలు తిరగేస్తున్న నేను ఆ పేజి వచ్చేసరికి రాజారావు వైపు చూశాను. రాజారావు కళ్ళలో జీరలు!

"మీరు గాడిదలా వున్నారని నేను, కాదు ఎలుగ్గొడ్డులా వున్నారని మా ఫ్రెండు వాదించుకుంటున్నాం. అందులో కరక్టు ఎవరంటారు?"

క్రింద సంతకంగాని, పేరుగాని లేదు!

మరో పేజీ తిప్పాను.

"ప్రతి అడ్డమైన అడ్డగాడిద కూడా మగాడట, ఇలా అడ్డమైన వాళ్ళలో నువ్వు ప్రథముడవట! మా ఫ్రెండు చెప్పింది!"

క్రింద సంతకం లేదు, పేరు కూడా లేదు!

కాని.... ఆ హేండు రైటింగ్ నాకు బాగా గుర్తు!

అది.... లక్ష్మిదే!

"ఎవరు రాసారంటావు?" అడిగాను.

"అదే అర్థం కావట్లేదు, ఇంతవరకూ నన్ను మెచ్చుకునే వారి సంఖ్య ఎక్కువనుకున్నాను, కాని...."

ఒకే ఒక నిముషం రాజారావు చెప్పిన మాటలు విని అసహనంగా ఇంటికి వచ్చాను.

"లక్ష్మి..."

"నేనో మాట చెబుదామనుకుంటున్నానురా అబ్బాయ్" అమ్మ అంది.

"చెప్పమ్మా"

"మరేం లేదు, కోడలు పిల్ల లక్ష్మిని కాలేజి మాన్పించేద్దామనుకుంటున్నాను. అదే అడిగాను 'లక్ష్మి'తో తను సరేనంది మరి నీ అభిప్రాయం!"

"నేను కూడా 'సరే'నే, అయితే ప్రయివేటుగా కట్టమను మొత్తం మీద ఆ బి.కామ్ పూర్తి చేసేయాలి."

మనసు తృప్తిగా వుంది.

మరెప్పుడూ రాజారావును కలువలేదు. కలవను కూడా! ఎందుకో, బహుశా ఈపాటికి మీకు తెలిసే వుండాలి. ●

# బుజ్జిగాడి యోగం



"ఏమండీ"

"........"

"ఏమండోయ్, వింటున్నారా? అప్పుడే పడుకున్నారా ఏమిటి?"

"అబ్బబ్బా, లేదులేవే! ఏవిటి సంగతి?"

"వో మాట చెప్పనా?"

"చెప్పు"

"కోపగించుకోరు కదా"

"లేదులే, చెప్పు"

"బుజ్జిగాడికి స్కూల్ రిక్షాని మాన్పించేద్దామనుకుంటున్నా"

"వాడెలా వెళ్తాడు?"

"నడిచి పోతాడు, స్కూలేమంత దూరంగా లేదు కదా"

"అది నిజమే.... అయితే అంత బరువున్న పుస్తకాల సంచో...?"

"సంచిని నేను తీసికుంటాను."

"విడిచి రావటానికి నువ్వెళ్తావా?"

"ఆఁ తప్పేముంది? నేను విడిచి వొచ్చేదాకా బేబీ దగ్గిర మీరెలాగూ వుంటారు కదా"

"సర్లె.... అయినా ఇదంతా ఎందుకెలేనిపోనిది"

"ప్రతినెలా ఇరవై రూపాయలు ఆదా చేయొచ్చండీ"

"ఆ డబ్బులేం జేస్తావ్?"

"ఎక్కువ పాలను తీసికుంటాను, బేబీ తాగిం తర్వాత బుజ్జిగాడికి వొక గ్లాస్ పాలు కూడ మిగ్గలటం లేదు."

"........"

"మాట్లాడరేమండీ... నేనేమయినా తప్పుగా మాట్లాడానా?"

"లేదు... రిక్షాని మాత్రం మాన్పించాల్సొస్తుంది."

"అయితే ఇంకేం. బుజ్జిగాడి కోసం వొచ్చే నెల నుంచి ఎక్కువ పాలు తీస్కోవచ్చు"

"ఎక్కువ పాలు తాగే అదృష్టం బుజ్జిగాడికి లేదేమో!"

"ఎందుకూ" అంటూ ఆవిడ మంచంపై దిగ్గున లేచి కూచొంది.

"వొచ్చేనెల నుంచి పరంధామయ్య ఇంటి అద్దె పెంచుతామన్నారు."

"పెంచుతా మన్నారా? ఎంత?"

"ఇరవైరూపాయలు!!!"

- విద్యారణ్య కామ్లేకర్